అడవిమల్లి మీద
మనసు పడి
అతను
చేసిన తప్పు!

# రుద్రాక్ష

డా. విప్పర్తి
ప్రణవమూర్తి
కథ

మాచర్లనుంచి విజయపురికి బస్సు చేరేసరికి తెల్లవారుజాము మూడయింది. అజయ్ బస్సు దిగి నడక మొదలెట్టాడు. మనిషి తోసేటంత వేగంగా కొండగాలి వీస్తోంది. వేళ్లను కొరికేటంత చలితో మంచు కురుస్తోంది. అప్పటికీ ఇంకా చీకటిగానే వుంది.

రెండు కొండల్ని కలుపుతున్న వంతెనా, దానికింద పరవళ్లతో ఉరుకుతున్న కృష్ణానదీ, కొండలమీదా, వంతెనమీదా, ప్రాజెక్టులోనూ, బారులు బారులుగా వెలుగుతున్న విద్యుద్దీపాలూ, నీటిలో వాటి నీడలూ, ఏదో దేవేంద్ర లోకాన్ని తలపింపజేస్తున్నాయ్.

మఫ్లరు, స్వెట్టరు, కాన్వాసు బూట్లు వేసుకుని, భుజాన్న ఎయిర్‌బాగ్‌నీ, మెడలో కెమెరానూ తగిలించుకున్న అజయ్, వంతెన దాటి విజయపురి నార్తు చేరేసరికి, మరో గంట పట్టింది.

తూరుపు నెమ్మదిగా ఎరుపెక్కుతూంది. దూరంగా కాపర్‌డామ్‌లో కదుల్తున్న మనుషులూ, బళ్ళూ, బుల్‌డోజర్లూ, చిన్న చిన్న చీమల్లాగా పురుగుల్లాగా కనిపించాయ్.

పైలాన్ కాలనీ చేరేసరికి వెలుగొచ్చేసింది.


జనసంచారం ప్రారంభమైంది.

అజయ్ లిఫ్టు ప్లీజ్ అని అర్థించేసరికి ఓ జీపువాలా అతడ్ని జీపులోకి ఎక్కించుకున్నాడు.

''నాగార్జున కొండ బంజారా గూడాలకా? అక్కడ మీకేం పని?'' అడిగాడు డ్రైవర్ దార్లో.

''నేను ఆంత్రపాలజీ పోస్టుగ్రాడ్యుయేట్ స్టూడెంట్‌ని. ఫోటోగ్రఫీ అంటే ఇంటరెస్టు. ఓ స్నేహితుడి ఆహ్వానంమీద అక్కడికి వెళ్తున్నాను'' చెప్పాడు అజయ్ హుషారుగా.

అరకులోయలోని అడవి పడుచులతోటి రాము తన అనుభవాలు చెబుతుంటే విన్న అజయ్‌కి



ఎన్నెన్నో కొంటె కోరికలు మదిలో మెదిలాయ్! బంజారా కోమలాంగులు, సింఘాల్ వేసిన బొమ్మల్లా వుంటారనీ, వారి ఫోటోలు కోకొల్లలు తీయాలనీ, వారితో జల్సాగా గడపాలనీ తన మనసులోని మాటను అజయ్ బయటపెట్టనే లేదు. డ్రైవర్ సడన్‌బ్రేక్ వేసేసరికి కలలుగంటున్న అజయ్ బయటి ప్రపంచంలోకి తూలిపడ్డాడు.

''ఆ గట్టుమీద రెండు ఫర్లాంగులు నడిస్తే

లంబాడీ గూడెంలు వస్తాయ'' ని చెప్పి వెళ్లిపోయాడు జీపు డ్రైవర్.

చిర్రున ఎండ కాస్తోంది. విఘ్నేశ్వరుడి గుడీ, ఆ గుడి ప్రక్కన, ఓ కిళ్లీ షాపూ, దాని ప్రక్కనే ఓ గున్నమామిడి చెట్టూ ఆ పైన రేకుషెడ్ల ఇల్లూ! కంట్రాక్టరు స్నేహితుడి ఉనికిని తేలికగానే పట్టేశాడు అజయ్.

కంట్రాక్టరు అజయ్‌ని చూసి సాదరంగా ఆహ్వానించాడు. కాఫీ ఫలహారాలైన తరువాత ''అజయ్, నీ అభిరుచికి జోహార్లు! ఇక్కడ బంజారాలు స్నేహపాత్రులే! అయినా కొంచెం జాగ్రత్తగా వుండాలి సుమీ'' అన్నాడు కంట్రాక్టరు నింపాదిగా.

''ఏం పరవాలేదు భాయ్! నేను చూసుకుంటాలే ఆ సంగతంతా'' అన్నాడు అజయ్ ధీమాగా.

''పదండి వాళ్లని మీకు పరిచయం చేస్తా'' అన్న స్నేహితుడి వెనకాల, భుజంమీద లైకా కెమెరాను తగిలించుకుని బయలుదేరాడు అజయ్.

దారిలో సదరు కాంట్రాక్టరు బంజారాల గురించి, తనకు తెలిసిందంతా చెప్పుకుపోతున్నాడు.

''బంజారాలంటే వనచరులు. అంటే అడవుల్లో తిరిగేవారు అన్నమాట. అసలు వీళ్ల వృత్తి గొర్రెల పెంపకం. ఇప్పుడు వ్యవసాయం కూడాను.

కానీ గుంపులు గుంపులుగా ఈ ప్రాజెక్టుకొచ్చి మట్టిపనిలాంటి సబ్‌కాంట్రాక్టులు చేస్తున్నారు''

కంట్రాక్టర్ అజయ్‌కి దారి చూపిస్తూ నడుస్తున్నాడు.

''వీరిది వింత మనస్తత్వం. దొంగతనం వీళ్లకి సరదా అయిన హాబీ. రాత్రుళ్లు ప్రక్క గుంపుల్లోనుంచి గొర్రెల్ని కొట్టుకొచ్చి, రాత్రికి రాత్రే వాటిని వండుకుని తినేస్తూ వుంటారు. మిగిలిన మాంసాన్ని కుండల్లో పెట్టి భూమిలో పాతి దాచేసుకుంటారు. అవతలి గుంపువాళ్లు వెతుక్కుంటూ వచ్చినా పెద్దల దగ్గరనుంచి పిన్నలవరకూ 'మాకేం తెలియదు' అని నాటకమాడేస్తారు'' కంట్రాక్టరు చెప్పుకుపోతున్నాడు.

''ఈ తెగలో ఆడవాళ్లకి నీళ్లు మోసుకురావడం, రొట్టెలు చేయడం, పశువుల్ని మేపడం ముఖ్యమైన విధులు. వీళ్లు వండే మాంసంకూర వుంటుందీ... చాలా బాగుంటుంది! సుగంధ ద్రవ్యాలు లేకుండానే చేస్తారు. పెద్ద పెద్ద మినిస్టర్లే వీళ్లతో వండించుకుని లొట్టలేసుకుంటూ తింటూ వుంటారు తెలుసా!'' కంట్రాక్టరు చెపుతూ వుంటే అజయ్‌కి నోరూరింది.

ముందుకు నడుస్తున్నారు ఇద్దరూను. దారిలో ఒకడ్ని గుంజకు కట్టి ఇద్దరు మనుషులు కొరడాలతో బాదుతుంటే వాడు ''బాబో నన్ను కొట్టకండ్రో! మీ కాల్మొక్కుతా'' అని అరుస్తున్నాడు. అక్కడ చాలామంది గుమిగూడారు.

''వీడు దండాఖాన్, అంటే శిక్ష వేయించుకున్నవాడు. ఇక్కడ ఎవడైనా తప్పుచేస్తే వాళ్ల నాయకుడే విచారించి శిక్ష విధిస్తాడు. పోలీసులవరకు వెళ్లనే వెళ్లరు. వీరిది స్వచ్ఛమైన పంచాయతీ వ్యవస్థ'' చెప్పుకుపోతూంటే అజయ్‌కి ఆశ్చర్యమనిపించింది.

వాళ్లు ఓ తాటాకు పాక దగ్గరకు చేరే సరికి అరవై ఏళ్ల ఆజానుబాహుడొకడు బైటికివచ్చాడు. కాంట్రాక్టరుని చూడగానే -

''దండాలు దొరా'' అన్నాడు అంత వస్తాదూను.

''ఆ! నమస్కారం రమణ నాయకా! ఈయనే నా స్నేహితుడు అజయ్. మీకు చెప్పా గదా, మీ బంజారాల గురించి రీసెర్చి చేయడానికొచ్చారు. కొన్నాళ్లు ఇక్కడే వుంటారు. జాగ్రత్తగా

చూసుకోండి'' అంటూ పరిచయం చేశాడు కాంట్రాక్టరు అజయ్‌ని.

''ఇతనే రమణ... నాయకుడు. ఈ తండాకు ముఖ్య నాయకుడు'' అజయ్‌తో చెప్పాడు కంట్రాక్టర్.

''మా గూడాన్ని చూసొస్తారండి'' అంటూ వాళ్లను బయలుదేరదీశాడు, నాయకుడు.

చిన్న చిన్న డేరాలూ కొన్ని తాటాకు పాకలు దాటుకుపోయారు వాళ్లు. దార్లో చాలామందిని వీరికి పరిచయం చేశాడు ఆ ముఖ్య.

ఇంతలో బిలబిలమంటూ పదిమంది పదహారేళ్ల ఆడపిల్లలు. కిలకిల నవ్వుకుంటూ ఓ పాకలోంచి బయటకొచ్చి క్రొత్తవారిని చూసి ఆగిపోయారు.

''ఇది నా తమ్ముడు బాలనాయక ఇల్లు. ఈ అమ్మాయి 'మల్లిక' నాకూతురు. ఈ అమ్మాయి 'కనక' నా తమ్ముడి కూతురు. ఈ అమ్మాయి లక్ష్మి...' అంటూ అందరినీ పరిచయం చేశాడు రమణ నాయక అజయ్‌కి.

పిల్లలందరూ ఒకే మోస్తరుగా ముస్తాబయ్యారు. ముందు చాతీని, జబ్బల్ని కప్పుతూ పొట్టవరకు వేలాడుతున్న ఎర్రటి జాకెట్టు, దాన్ని వెనక తాళ్లతో మాత్రమే కట్టడంవల్ల వీపుని మాత్రం దాచలేకపోయింది. మొలనుంచి కట్టిన పావడా మోకాళ్లవరకే వచ్చింది. తలమీదునుంచి ఓణి పిరుదుల క్రిందవరకూ జీరాడుతుంది. వీటన్నింటినిండా అద్దాల, బుట్టా పనితనం అద్భుతంగా వుంది. తలలో పాపిడి పిందె, చెవులకు, మెడలోనూ, కాళ్లకూ, వెండి నగలు మస్తుగా వున్నాయి. భుజాలనుంచి మోచేతివరకు దంతం గాజులున్నాయి.

అజయ్‌కి మల్లికలో ప్రత్యేకమైన ఆకర్షణ కనబడింది. ఆమె అందం చూసినప్పుడు అతని కళ్లు చెదిరిపోయాయి. నల్లటి రెండు పొడవైన జడలూ, తెల్లటి మైచాయా, చారడేసి కళ్లూ, సంపెంగ ముక్కూ, నవ్వితే సొట్టలుపడే బుగ్గలూ, జాకెట్టు వెనుక దాగిన ఉరోజాలూ, వాటిమీదకొచ్చిన శిరోజాల కొసలూ... ''మల్లిక అడవిలో పుట్టిన మల్లెలా వుంది'' అనుకున్నాడు అజయ్.

ఆ అమ్మాయిలంతా ''దండాలు దొర'' అని చెబుతూ చేతులు జోడించారు. వారితో మెల్లగా ఏమో చెప్పాడు నాయకుడు. లోపలికి వెళ్లి



## కథ వెనుక కథ

లంబాడీలను చూసినప్పుడల్లా నా చిననాటి స్నేహితుడొకడు గుర్తుకొస్తాడు. కష్టజీవులైన లంబాడీ వారు మంచి అంగ సౌష్ఠవం కలిగి వుంటారు. వారి ఆడపిల్లలలో కొంతమంది అతిలోక సుందరిలుంటారు. వారి పంచాయితీ వ్యవస్థ పటిష్ఠం. వారి ఆచార వ్యవహారాలు వింతగా వుంటాయి. కొంత లంబాడీ తెగల పరిశోధనా, వారితో స్నేహితుని అనుభవమే ఈ కథ.

-వి. ప్రణవమూర్తి

నిమిషాల్లో ఆకుల్లో రొట్టెలు, మాంసం కూర, గ్లాసులతో పాలూ తెచ్చారు ఆ యువతులు. అజయ్ ఆబగా తినడం వింతగా తోచింది కంట్రాక్టరుకి.

ఇంతలో పదిమంది కుర్రాళ్లు అటువైపు వచ్చారు. వాళ్లు అక్కడి ఆడపిల్లలతో ఎకసెక్కాలాడుతూ అంతా కలిసి గబగబా గూడెంలోకి వెళ్లిపోయారు.

స్నేహితులిద్దరూ తిరిగి తమ స్థావరానికి బయలుదేరారు.

''పెళ్లికాని ఆడపిల్లలతో మగపిల్లలు చాలా సరదాగా వుంటార్లే ఇక్కడ. ఈ పరిహాసాలు వాళ్లకు తప్పుకాదు'' అజయ్‌తో చెప్పాడు కాంట్రాక్టరు. అజయ్‌కి హుషారుగానే వుంది.

ఆ కొత్త ప్రపంచం అజయ్‌ని బాగా ఆకర్షించింది. ముఖ్యంగా మల్లికతోడి సాన్నిహిత్యం అజయ్‌ని పిచ్చివాడ్ని చేయసాగింది. మల్లికకూడా అజయ్‌కి అన్నపానాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించేది. రోజులు గడుస్తున్నాయి. మల్లికనుంచి అజయ్ చాలా విషయాల్ని సేకరించాడు.

''పెళ్లికాని ఆడపిల్లలు పైనుంచి మోచేతివరకే దంతం గాజులు వేసుకుంటారు. పెళ్లయినవాళ్లు ముంజేతివరకూ కూడా వేసుకుంటారు''

''ఎవడికైనా, ఓపికుంటే, పెంచగల స్తోమతుంటే, ఎన్ని పెళ్లిళ్లయినా చేసుకోవచ్చు''

''అన్న విధి వశాత్తు చచ్చిపోతే వదిన తమ్ముడికి భార్య అవుతుంది''

''బంజారాల్లో కొంతమంది పక్కా శాకాహారులుకూడా వుంటారు'' ఇలా ఎన్నో విషయాలు మల్లిక చెబుతూ వుంటే అజయ్ డైరీలో నింపుకున్నాడు.

★ ★ ★

ఆ రోజు రాత్రి భోజనం చేసి కాంట్రాక్టర్ షెడ్‌లో పడుకున్నాడు అజయ్. ఎంతకీ నిద్ర రావడంలేదు. కళ్లముందు మల్లిక రూపమే కదలాడుతోంది. లేచి ఆరుబైటకొచ్చాడు అజయ్. పిండారబోసినట్లు వెన్నెల కురుస్తూంది.

దూరంగా గాలివాటంలో సన్నగా, శ్రావ్యంగా వేణుగానం వినిపిస్తోంది. ఆ ప్రక్కకి వెళ్లకుండా వుండలేకపోయాడు. అజయ్! అలా నడిచేసరికి గూడెమే చేరువయింది. పిల్లనగ్రోవి, దానికితోడు డోలు వాయిద్యం, మరికొంచెం దగ్గరగా పోయేసరికి ఒక పడుచువాడి పాట వినబడింది.

''కలువరాయ, జగతి వెన్నెల
కలచివేసెనే నా మనస్సిలా
కదిలిరాదే నా కలల ప్రేయసి
కడలిదాటి మనువాడ నాతో కలసి'' అంటూ పాట పరవశంగా సాగిపోతోంది.

అక్కడ రమణనాయక అజయ్‌ని చూసి ''రా దొరా'' అంటూ దగ్గరకు తీసుకెళ్లి రాతిబండమీద కూర్చోబెట్టాడు.

చిక్కటి వెన్నెల, రాతి గుట్టలకి, గుబురు పొదలకి, ప్రక్కనే జరజరా పారుతున్న కృష్ణా జలాలకి వెండి పూత పోస్తోంది.

అమాయకమైన ఆడపిల్లలు అజంతా శిల్పాల మాదిరిగా చేస్తున్న అభినయాల్ని కనులారా చూస్తున్నాడు అజయ్. కలల్లో విహరిస్తున్నట్లున్నది అతనికి.

''మా పిల్లలకి నాట్యం పుట్టుకతోనే వస్తుంది'' రమణనాయక మాటామాటా చెపుతున్నాడు అజయ్‌కి.

అజయ్ తిరిగొచ్చి పడుకునేసరికి రాత్రి రెండు గంటలు దాటింది.

★ ★ ★

రోజా గూడెంలో ఏదో క్రొత్త వింతే!

ఆ రోజు ముఖ్య తమ్ముడు బాలనాయక ఇంట్లో ఏదో సంబరమట. మల్లిక అజయ్‌ను అక్కడికి

తీసుకెళ్లింది.

బాలనాయుకుడి కూతురు కనకకి పెళ్లి చూపులు. పెండ్లికొడుకు ప్రక్క తండాలోని యువకుడే! వాడు పెండ్లికూతురింట్లో నెల్లాళ్లుగా బండచాకిరి చేయాలట. చేస్తూనే వున్నాడు!

నెత్తిమీద గుడ్డేసుకున్న ఈ పెండ్లికొడుకు దర్జాగా కూర్చున్న బావమ్మర్దిది నోట్లోని చుట్టను వెలిగించే విఫలప్రయత్నం చేస్తున్నాడు. చుట్టకి నిప్పు అంటుకోకుండా బావమ్మరిది దాన్ని పదేపదే ఆర్పేస్తున్నాడు. నడుం ఎంత పీకుతున్నా ఆ ప్రయత్నం చేస్తూనే వున్నాడు పెండ్లికొడుకు.

''వంచిగుండవా? పరిషాన్ అయిపోతున్నావేటి? చుట్టంచురా!'' పెండ్లికొడుకుని గేలిచేస్తున్నారు తక్కిన వారంతాను.

''గిల్లా లాభం లేదు నువ్ బైటకు రా'' అన్నాడొకడు.

''గాడు బైటికి రావాలి'' అంటూ అందరూ వాడిని బైటకు లాగారు. ''గపోల్ని కొడా రమ్మను'' అంటూ కనకని కూడా బయటకు రప్పించారు.

''సికర్ పడొద్దు బాయ్. ఎత్తుకా పోనీ పెండ్లాన్ని. గప్పుడొస్తది మజా'' మరొకడు అరిచాడు.

''చప్పుడు చేయకుండా ఊ అని కూచుంటే ఏమిటి? ఎత్తుకపో! నీ పెండ్లాన్ని ఖలేజా వుంటే!'' సవాలు చేశారంతా.

ఒక్క ఉదుటున ఆ పెండ్లికొడుకు కనకను వీపుమీద ఎక్కించుకుని పరిగెత్తడం ప్రారంభించాడు. బావమ్మరుదులండా చింతబరికెలు తీసుకుని పెళ్లికొడుకు కాళ్లమీద గట్టిగా బాదుతూంటే, అతగాడు చలించకుండా ఫర్లాంగుదూరంలో వున్న మామిడి చెట్టును పట్టుకుని తిరిగొచ్చి కనకను ఇంటిదగ్గర దింపాడు. ఈ పరీక్షతో అతను అన్ని పరీక్షలూ నెగ్గాడట.

అరుచుకుంటూ వచ్చి అందరూ అతడ్ని అభినందించారు.

మామ బాలనాయుకుడు వచ్చి వాడ్ని కౌగిలించుకుని ''ఏమిరా మరిక, పైసలేవి? రెండువేలు తే. నాల్గు గేదెల్ని, ఐదు గొర్రెల్ని సట్టుకరా. సందమందికి సారానీ తే. సంచమినాటికి నీ పెళ్లి'' ఖరారు చేశాడు.

''సిరిమల్లి చెట్టుకింద లచ్చివమ్మో
సిరులేమి తెచ్చారు నీకమ్మో...'' అంటూ అందరూ ఆనందంగా పాటలు పాడారు.

అజయ్ మరుసటిరోజు ఉదయం గూడెంలోకి చేరుకునేసరికి అక్కడేమిటో అలజడిగా వుంది.

గూడెం మనుషులు ''ఆడికేమయింది?'' అంటూ పరుగెత్తుకొస్తున్నారు. ''బస్తీగాడెవడో వచ్చాడు'' అంటూ ఓ నడి వయస్కుడ్ని పెడరెక్కలు విరిచి కొంతమంది తీసుకొస్తున్నారు. అందరూ వాడ్ని కుళ్లబొడుస్తూనే వున్నారు.

వాడి కుడికన్నుగుడ్డు ఊడి బైటకొచ్చేసింది. వాడి ముఖమంతా, ఒళ్లంతా రక్తం మయం.

''ఈడు మన మల్లిక నీళ్లు తెస్తుంటే దాని చేయి పట్టుకోబోయాడు'' ఎవడో చెబుతున్నాడు అందరికీ.

ఆ సమయంలో చింతనిప్పుల కళ్లతో, చింపిరి జుట్టుతో మహాకాళిలా, భయంకరంగా, నెమ్మదిగా నడుచుకొస్తున్న మల్లికను చూశాడు అజయ్.

''మల్లిక పెనుగులాటలో తన మొలలో వున్న పులిగోరువంటి బాకుతో వాడి ముఖాన్ని రక్కింది'' ఎవరో చెబుతున్నారు.

★ ★ ★

అజయ్ ఆ గూడెంనుంచి, ఆ వూరినుంచి తిరిగిపోయేందుకు ఎన్నో క్షణాలు పట్టలేదు. తిరిగి ఆ ఊరి ఛాయలకు కూడా ఎప్పుడూ వెళ్లలేదతను.

★ ★ ★